క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని రంగనాయకుల ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం కొహెడ, తొర్రూర్, బ్రాహ్మణపల్లి పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తాడిపర్తిలో..

యాచారం: విద్యుత్ లైన్లల్లో మరమ్మతుల దృష్ట్యా శనివారం తాడిపర్తి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ సందీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఉప్పల ట్రస్టు చేయూత



ఇంటి నిర్మాణానికి మెటీరీయల్‌ను అందజేసిన ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: పేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ చేయూత నందిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన పెంటయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య, సుల్తాన్, నిరంజన్ నూతన ఇండ్ల నిర్మాణాలకు శుక్రవారం ట్రస్ట్ తరపున ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర, తదితర ఇంటి మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో బాలకిష్టయ్యగౌడ్, రాములు, మల్లయ్య, లింగయ్య, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



పరశురాములు కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్

తలకొండపల్లి: చంద్రధనకు చెందిన బీజేపీ నాయకుడు పరశురాములు ఇటీవల మృతి చెందారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆచారి పిలుపు మేరకు చంద్రధన బీజేపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులకు రూ. 7000 ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు సభ్యులు కృష్ణవేణి, యాదగిరిగౌడ్, రాణి, రాజు, రేణుక, యాదయ్య, మాజి ఉప సర్పంచ్ ప్రసాద్, శ్రీశైలం, మల్లయ్య, జంగయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

పెట్రోలింగ్‌ను మెరుగుపరుస్తాం



టీఐఎస్ఎస్‌ను పరిశీలిస్తున్న పోలీస్, మున్సిపాలిటీ అధికారులు

ఇబ్రహీంపట్నం: టీఐఎస్ఎస్ విద్యార్థుల భద్రత, రక్షణ కోసం వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ పెట్రోలింగ్‌ను మెరుగుపరుస్తామని ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్ నుంచి వచ్చిన పిటిషన్ మేరకు శుక్రవారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, షీటీమ్ ఏసీపీ నరేందర్, స్థానిక పోలీస్ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. ఈ టీఐఎస్ఎస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి రోడ్డులో ఉన్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో అన్ని విధాల రక్షణ చర్యలు చేపడుతామని తెలిపారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి



రైతు బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: రైతు బీమా పథకం కోసం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు ఈ నెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణ కుమారి కోరారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏఈఓలు రాణి, మీనాక్షి, శివతేజ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఇబ్రహీంపట్నం: ఇరుకురోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్



ఆమనగల్లు: ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు

- ఇరుకు రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్
- భయాందోళనలో ఖానాపూర్ గ్రామస్తులు
- యమపాశాలుగా మారుతున్న విద్యుత్ తీగలు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని విద్యుత్‌శాఖ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీపట్నం మున్సిపాలిటీ పరిదిలోని ఖానాపూర్ గ్రామంలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ మారింది. ఇరుకు రోడ్డులో, ఇళ్ల మధ్యలో, అతి తక్కువ ఎత్తులో.. ఎలాంటి రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలు వణికిపోతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని హడలిపోతున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి ఓ వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. గతంలో మంచాల మండల సబ్‌స్టేషన్ పరిధిలో ఖానాపూర్ ఉండేది. ఇప్పుడు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో విలీనం చేశారు. ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోకి వచ్చిన సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇతర ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు మున్సిపాలిటీలో పలు కాలనీల్లో విద్యుత్‌లైన్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్విచ్‌బోర్డులు ఏర్పాటు చేశారు. ఇవి చేతికందే ఎత్తులో ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

మండలం సాధించే వరకు పోరాటం

- వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి
- 33వ రోజుకు చేరుకున్న దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం ఆగదని శ్రీనివాస్‌రెడ్డి వైస్ ఎంపీపీ స్పష్టం చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులన్నీ గట్టుఇప్పలపల్లికి ఉన్నాయని గుర్తుచేశారు. నాయకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోకపోవడంతో మండలం ఏర్పాటు కావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రేణురెడ్డి, కృష్ణయ్య, కాంగ్రెస్ నేత డేవిడ్, దామోదర్, చంద్రయ్య, రాజేందర్, కృష్ణయ్య, మండల్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

తలకొండపల్లి: పశువుల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, గట్టుఇప్పలపల్లిలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పశు పోషణలో జాగ్రత్తలు పాటించి పశు సంపదను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమరాజు, వైద్యులు అగ్నివేశ్, శంకర్, రైతులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్‌లో చేరికలు



కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కవాడిపల్లి నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని కవాడిపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో యాదవ సంఘం అధ్యక్షుడు కాశయ్య, నాయకులు సత్తయ్య, శ్రీరాములతో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ గౌడ్, సీనియర్ నాయకులు కృష్టారెడ్డి, భీమ్ రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: కడ్తాల మండలం కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్, కడ్తాల జెడ్పీటీసీ సభ్యులు దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో రాజు, యాదయ్య తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగు వీరయ్య, లచ్చిరాంనాయక్, చంద్రమౌళి, గోపాల్, రమేశ్, వినోద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఆమనగల్లు: కడ్తాల మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్వర్‌ను శుక్రవారం రావిచేడ్ ఎంపీటీసీ గోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో అన్వర్‌ను కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, మల్లేశ్ యాదవ్, పవన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వివిఎల్ చంద్రకళను బీఆర్ఎస్వీ నాయకులు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్‌తో పాటు కరుణాకర్, కిరణ్, యాచారం సురేశ్, శేఖర్‌యాదవ్, భాస్కర్, పవన్‌లు పాల్గొన్నారు.



తహసీల్దార్ అన్వర్‌ను సత్కరిస్తున్న గోపాల్

కుష్టువ్యాధిని నిర్మూలిద్దాం

తుర్కయంజాల్: జిల్లాలో కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు ఆశావర్కర్లతో ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. వ్యాధి ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుందని, చర్మంపై పాలిపోయిన రంగులేని, స్పర్శ లేని మచ్చలుంటే అలాంటి వారిని గుర్తించి అనుమానిత కుష్టువ్యాధి రోగిగా నమోదు చేయాలన్నారు. వ్యాధిపై ప్రజల్లో పెద్ద అవగాహన కల్పించాలని కోరారు. సకాలంలో ఈ వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రోగులకు అవసరమైతే ఎంసీఆర్, చెప్పులు, కృతిమ పరికరాలు అందిస్తామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి

మార్కెట్ కమిటీకి 2.65 కోట్ల ఆదాయం



ఆమనగల్లు మార్కెట్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 2022-23 సంవత్సరానికి 2.65 కోట్లు ఆదాయం సమకూరిందని ఆమనగల్లు మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో అభివృద్ధి పనులకు ఈ నెలలో శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం మార్కెట్‌కమిటీ పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో గత ఏడాది బడ్జెట్ వివరాలపై చర్చించారు. ఈ ఏడాదికి 2.13 కోట్లు ఆధాయం లక్ష్యంగా నిర్ణయించారు. మార్కెట్ యార్డులో 8 దుకాణాల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కడ్తాల్ చెక్‌పోస్టు భవనం నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరియాదవ్, మార్కెట్ కార్యదర్శి సరోజ, డైరెక్టర్లు లాయక్ అలీ, నిరంజన్, సుభాశ్, రమేశ్‌నాయక్, కాసుల కృష్ణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృత తుల్యం

హయత్‌నగర్: తల్లిపాలే పిల్లలకు అమృత తుల్యం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ గీతా శ్రీరాములు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కుంట్లూరు అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యాక్రమంలో ఆమె పాల్గొని తల్లిపాల విషిష్టత గురించి వివరించారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు తాగిస్తే అది అమృతం అవుతుందన్నారు. అనంతరం తల్లులకు పౌష్టికాహారం అందజేశారు.



తల్లులకు పౌషికాహారం అందజేస్తున్న గీతా శ్రీరాములు

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం యాచారం పోలీసులు పట్టుకున్నారు. ఓంకారేశ్వరాలయ భూముల్లో కొద్ది రోజులుగా పలు గ్రామాలకు చెందిన వ్యాపారులు మట్టి తరలించి విక్రయిస్తున్నారు. స్థానికులు పలుమార్లు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు 100కు ఫోన్ చేసి దేవాలయ భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు చేశారు. సమాచారం మేరకు యాచారం పోలీసులు ఆలయ భూముల్లో మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశారు.



యాచారం పోలీస్‌స్టేషన్‌లో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

లయన్స్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



నగదు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: లయన్స్ క్లబ్ సొంత భవన నిర్మాణానికి 200 గజాల స్థలాన్ని కేటాయిస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఇబ్రహీంపట్నం 320 సీ 30వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక భారత్‌గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడుగా ఇందూరి శ్రీనివాస్, సెక్రటరీగా కేవీ రమేష్‌రాజు, ట్రెజరర్‌గా భీంరావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సకవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను అభినందించారు. మరిన్ని సేవ కార్యక్రమాలను గ్రామాలకు విస్తరింపజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ వెంకట్‌నారాయణరెడ్డితోపాటు కృష్ణప్రసాద్, ఇన్నారెడ్డి, శ్యామ్‌ప్రసాద్, కృష్ణకుమార్, హరికృష్ణరెడ్డి, ఇన్‌స్టాలేషన్ చైర్మన్ ఆకుల యాదగిరిలు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఇబ్రహీంపట్నం: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని, పలు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్‌మెన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న 698 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చాలిచాలని జీతాలతో గడుపుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. తమ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించాలని వారు కోరారు.

లయన్స్‌క్లబ్ సభ్యుల చేయూత

ఆమనగల్లు: స్నేహితుడి మృతితో ఇబ్బందులు పడుతున్న కుటుంబాన్ని తోటి స్నేహితులు చేయూత నందించారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1983లో ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన ఆకుల రమేశ్ గత ఏడాది మృతి చెందాడు. దీంతో రమేశ్ కుమార్తె భానురేఖ చదువుకోసం లయన్స్‌క్లబ్ సభ్యులు భిక్షపతి, శ్రీనివాస్, వెంకట్, ఎండీ ఖాజా, విష్ణువర్దన్‌రెడ్డి, మాణిక్‌రావ్, కేశవులు కలిసి రూ.50116 నగదును అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు మిట్టపల్లి అంజయ్య, ఓంకారం, సత్యనారాయణ, రమేశ్, రాంరెడ్డి, మనోహర్, కేశవులు, మధన్, తదితరులు పాల్గొన్నారు.

5న స్వచ్ఛ్ మాసబ్ చెరువు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని మాసబ్ చెరువు వద్ద ఈ నెల 5వ తేదీన చేపట్టనున్న స్వచ్ఛ్ మాసబ్ చెరువు- స్వచ్ఛ్ తుర్కయంజాల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడం, నీటిలోని చెత్తను తీసివేయడం, కట్టమైసమ్మ గుడి చుట్టూ ఉన్న చెట్ల పొదలను తొలగించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు.

వికలాంగులకు రిజర్వేషన్లను కల్పించాలి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రకటించిన ఎక్సైజ్‌శాఖ నోటిఫికేషన్‌లో వికలాంగులకు ఐదు శాతం మద్యం షాపుల్లో రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల జాతీయ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం తిరిగి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల్లో తమకు రిజర్వేషన్ల వర్తింప జేయాలన్నారు. తక్షణమే జీవో 98ను సవరించి.. వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలు పరుస్తూ తాజా నోటిఫికేషన్ విడుదల చేయాలని లేకుంటే టెండర్స్ ప్రక్రియను అడ్డుకుంటామని హెచ్చరించారు.

రైతుల భూసమస్యలకే ప్రాధాన్యత

యాచారం: రైతుల భూసమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత ఇస్తానని యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా, రైతుల భూసమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతులు భూసమస్యలుంటే నేరుగా తనను తెలియజేయాలని సూచించారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా మెహరాజ్

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దఅంబర్‌పేటకు చెందిన మహ్మద్ మెహరాజ్‌ను నియమించారు. మైనార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంజీ జహంగీర్ జారీ చేసిన నియామక పత్రాన్ని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు దండెం రాంరెడ్డి మెహరాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మెహరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలిపారు.

రైతును రాజును చేయడమే కేసీఆర్ లక్ష్యం



ఆమనగల్లు: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు



కడ్తాల్: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రతి రైతును రాజును చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి అన్నారు. రైతు రుణామాఫీపై సీఎం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, రైతుబంధు మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

ఆమనగల్లు: రైతు సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆమగనల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ గిరియాదవ్‌లు అన్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుభాశ్, రమేశ్, శేఖర్, లాయక్ అలీ, నిరంజన్, కాసుల కృష్ణయ్య, కౌన్సిలర్ కమటం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్‌లో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేశ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, మండల రైతు సమన్వయ సమితీ కన్వీనర్ జోగు వీరయ్య, సర్పంచ్‌లు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు కరెంట్ కష్టాలు

- 4 రోజుల క్రితం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్
- ఎండిపోతున్న వరి పొలాలు
- లబోదిబోమంటున్న కర్షకులు

తుర్కయంజాల్: రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యలపై వినియోగదారులు, రైతులు ఫిర్యాదులు చేసినా.. అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. దీంతో ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కాక రైతన్న తలపట్టుకుంటున్నాడు. తుర్కయంజాల్‌లోని కుర్మగూడలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయింది. గురువారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు.అయినాఅదిపనిచేయకపోవడంతో వరి నాట్లు ఎండిపోతున్నాయి. రైతులు ఫిర్యాదు చేసిన విద్యుత్ సిబ్బంది స్పందించకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. 10 రోజుల క్రితం తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది.

మోటార్లలోనే సమస్య

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేశాం. రైతుల మోటార్లలోనే సమస్య ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు కాలిపోతున్నాయి. మోటార్‌లను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. - శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ



నాలుగు రోజులుగా వ్యవసాయ మోటారు నీరు పోయకపోవడంతో ఎండిపోతున్న వరిచేను